# మానుకోట మున్సిపాలిటీని నూతన హంగులతో తీర్చిదిద్దాలి

- ప్రతి కాలనీకి తాగునీరు అందాలి
- పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా కృషి చేస్తా
- ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 12: మానుకోట మున్సిపాలిటీని నూతన హంగులతో తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ పాల్గొనగా, ఎమ్మెల్సీ రవీందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్ణపు సోమయ్య, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, సీపీఐ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారథి మున్సిపాలిటీలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక నిధులు మంజూరు చేసి పట్టణంలో అభివృద్ధి పనులు చేసిందని, పార్కులను సుందరీకరించిందని, కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి పేదలకు మెరుగైన సౌకర్యాలు కల్పించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీకి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ అన్నారు. మున్సిపల్ మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో పట్టణ అభివృద్ధికి అనేక నిధులు మంజూరు చేయడంతో ప్రగతి జరిగిందని బీఆర్‌ఎస్ వార్డు కౌన్సిలర్ వెంకన్న అన్నారు. అనంతరం కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే మురళీ నాయక్‌ను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

**పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలి..**

ఆధునిక పరిజ్ఞానంతో పట్టణాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, పార్కుల ఏర్పాటు, రోడ్డు డివైడర్లను ప్రత్యేక ప్రణాళికతో నిర్మించిందన్నారు. మానుకోట మున్సిపాలిటీలో ప్రధానంగా శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో అర్హులందరికీ వెంటనే ఇంటి నంబర్లు కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరులను గుర్తించాలని, అర్హులకు ఇంటి నిర్మాణ అనుమతిలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అక్రమ వెంచర్ల పై అధికారులు దృష్టి పెట్టాలని, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలన్నారు. ప్రధానంగా నిజాం చెరువు, స్మృతివనాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. పట్టణంలో పార్కులను సుందరీకరణ చేసి, మిషన్ భగీరథ పైపులైన్‌పై రివ్యూ చేసి కాలనీలకు నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**పేదలకు న్యాయం జరిగేలా కృషి చేస్తా : ఎమ్మెల్యే** మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శివారు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రతినెలా అధికారులు రివ్యూ మీటింగ్ పెట్టి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చెరువు శిఖం భూములను పరిరక్షించాలన్నారు. ప్రతి కాలనీకి పైపులైన్ వేసి తాగునీరు అందిస్తామని, ఇల్లు లేని పేదలకు లబ్ధి జరిగేలా చూస్తామన్నారు. పట్టణంలోని రోడ్ల మరమ్మతులు, కాలనీల్లోని ఇంటి నంబర్లను వెంటనే పరిష్కరిస్తామని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గం ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఈ ఉపేందర్, మిషన్ భగీరథ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తాం

**ఎమ్మెల్యే మురళీనాయక్**

మహబూబాబాద్ రూరల్, జనవరి 12: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ఏడు నెలల నుంచి కల్యాణ లక్ష్మి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని పరిశీలించి అర్హులకు అందించాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డిని ఆదేశించారు. జిల్లాలోని పేదలకు ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ధి జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వెన్నం లక్ష్మారెడ్డి, పోతురాజు రాజు, బీ శ్రీనివాస్, బుజ్జి వెంకన్న, హరిసింగ్, ఎంపీటీసీ మిట్టకంటి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మాట్లాడుతున్న అద్వైత్ కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, జనవరి 12: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సిబ్బందికి కేటాయించే విధులపై అవగాహన కలిగి ఉండి, వారికి కేటాయించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సీపీవో, ఈవీఎం నిర్వహణను అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, డీపీవోలకు ఎన్నికల పోలింగ్ నిర్వహణ శిక్షణ కార్యక్రమాలు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఎన్నికల వ్యయ, ఖర్చులు జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్ చూసుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

డోర్నకల్, జనవరి 12: ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం డోర్నకల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించి, సీపీఎస్ రద్దు చేయాలని, పదోన్నతులు, బదిలీల సమస్యను పరిష్కరించాలన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల, సమగ్రశిక్ష ఎయిడెడ్ సిబ్బందికి నవంబర్, డిసెంబర్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి నర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి యాకూబ్, జిల్లా కార్యదర్శి నామ నాగేశ్వరరావు, ఆడిట్ కన్వీనర్ వివేక్, డోర్నకల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ జీజ్, శివప్రసాద్, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్ రాములు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ‘షూటింగ్ బాల్’లో రాణించాలి

తొర్రూరు, జనవరి 12: విద్యార్థులు షూటింగ్ బాల్ క్రీడలో రాణించాలని షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగే సౌత్ జోన్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు అందజేసి మాట్లాడారు. పాఠశాల దశలోనే ఆటలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్‌లో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. సిటీమాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య, ఏసీఎస్ డైరెక్టర్ కల్వకొలను జనార్దన్‌రాజు, భూపోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సోమయ్య, ముసాజిత్, మునిరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## జీవితం ఎంతో విలువైనది..

నర్సింహులపేట, జనవరి 12: జీవితం ఎంతో విలువైనదని, జీవించడానికేనని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్, డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దనాగారం గ్రామంలో సీనియర్ నాయకుడు టేకుల యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ పదేళ్లుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తున్నదన్నారు. అనంతరం ప్రమాణం చేయించారు. శ్రీనివాస్, నర్సయ్య, సీనియర్ అడ్వకేట్ ప్రభాకర్, సతీశ్, ధర్మ, ఆరోగ్యమిత్రసంస్థ ప్రతినిధి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

# కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పడుతోంది

- ఇందుకు మండల అధ్యక్షుడు ముసలయ్య తీరే కారణం
- ఏకపక్ష, నియంతృత్వ ధోరణితో వర్గ విభేదాలు
- విలేకర్ల సమావేశంలో పార్టీకి చెందిన ఓ వర్గం

సమావేశంలో మాట్లాడుతున్న రామునాయక్

బయ్యారం, జనవరి 12: కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంబాల ముసలయ్య వల్ల పార్టీ భ్రష్టు పడుతోందని కాంగ్రెస్ నాయకులు రామునాయక్, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్‌నాయక్, సుధాకర్, మోహన్‌జీ అన్నారు. వర్గపోరు నేపథ్యంలో శుక్రవారం మండలకేంద్రంలో ఓ వర్గానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిలు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పదెండ్లపాటు పార్టీని నమ్ముకొని ఉన్నవారిని ముసలయ్య విస్మరించి ఏకపక్ష, నియంతృత్వ ధోరణితో నిర్ణయాలు తీసుకుంటున్నాడని, అందువల్ల వర్గపోరుతో కాంగ్రెస్ పార్టీ మండలంలో కనుమరుగవుతోందని మండిపడ్డారు. పార్టీ ఇచ్చిన పదవిని స్వలాభం కోసం వాడుకుంటున్నడని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోరం కనకయ్య గెలుపునకు సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి తీవ్రంగా కృషి చేశాడని, కానీ ఇప్పుడు ఆయన పార్టీకి సంబంధం లేదని ప్రకటించడం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో వర్గవిభేదాల కారణంగా ప్రభుత్వ పథకాలు అందుతాయా .. లేదా.. ? అని ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు జిల్లా నాయకత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రెండ్రోజుల క్రితం కాంగ్రెస్ కాకార్యాలయంలో జరిగిన వివాదానికి ముసలయ్య వైఖరే కారణమని, జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిని సైతం తప్పుదోవ పట్టిస్తున్నాడని, ముసలయ్యను వెంటనే పదవిలో నుంచి తొలగించాలని కోరారు. ఈ విషయంపై పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచులు రాజు, కిరణ్, పద్మ, నీలమ్మ, లక్ష్మి, ఉపసర్పంచ్ కవిత, ఎంపీటీసీలు శైలజారెడ్డి, నాయకులు వీ శ్రీను, సుధాకర్‌రెడ్డి, నాగేందర్, సురేశ్, వీరలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, జనవరి 12: అయ్యప్ప స్వామి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాటిమీద ఆలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, అయ్యప్ప మాలధారుడు సోమరాజ శేఖర్ నారికేల (18వ) ఇరుముడి కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల అమలు దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, అర్హులందరికీ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. పాలకుర్తి సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటానని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పనులు పూర్తికి చొరవ చూపుతామని తెలిపారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి

**క్యాలెండర్ ఆవిష్కరణ..**

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆలయ శాశ్వత నిధి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణకలశంతో ప్రధాన అర్చకుడు స్వాగతం పలికారు. అర్చన, ప్రత్యేక పూజలు జరిపి ఎమ్మెల్యే, ఝాన్సీరెడ్డి క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, గజమాల, మెమెంటోతో వారిని సత్కరించారు. విశ్వబ్రాహ్మణ పురోహిత జిల్లా అధ్యక్షుడు ఇటికెల విశ్వప్రకాశచార్యులు, అర్చకుడు విక్రమ్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి పూర్ణాచారి, కోశాధికారి చంద్రశేఖరాచారి, బోగోజు సదానందాచారి, పబ్బోజు వెంకటాచారి, అబ్బనపురి పూర్ణాచారి, రాగి శ్రీనివాసచారి, గజ్జెల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు రగ్గులు, దోమతెరల వితరణ

తొర్రూరు, జనవరి 12: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అమ్మాపురం, ఖానాపురం, సోమారం, హచ్చుతండా, కంఠాయపాలెం గ్రామాల్లోని వృద్ధులకు రగ్గులు, దోమతెరలు అందజేశారు. సొసైటీ జిల్లా డీసీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున పేదలు, వృద్ధులకు రగ్గులు, దోమతెరలు పంపిణీ చేశామన్నారు. సొసైటీ తొర్రూరు డివిజన్ సభ్యుడు విశ్వేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## బాల కార్మికుడిని గుర్తించిన లేబర్ ఆఫీసర్

**ఇటుక బట్టి యజమానిపై పోలీసులకు ఫిర్యాదు**

నెల్లికుదురు, జనవరి 12: ఇటుక బట్టీలో పనులు చేస్తున్న బాల కార్మికుడిని లేబర్ ఆఫీసర్ గుర్తించి, యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కే క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. తొర్రూరు ఇన్‌చార్జి లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్ కుమార్, ఎండీ మౌలాన(ఎస్సై-2 మరిపెడ), బీసీ రమేశ్(పీసీ-పెద్దవంగర), డీ సుధారాణి(పీసీ-సీరోల్), జే బగ్గు నాయక్(పీసీ-దంతాలపల్లి), కే శ్రీనివాసచారి(పీసీ-నెల్లికుదురు), బీ అనిల్ కుమార్(చైల్డ్ వర్కర్)లు ఆపరేషన్ స్మైల్-10లో భాగంగా శుక్రవారం మండలంలోని శ్రీరామగిరి ఇటుక బట్టీ వద్ద తనిఖీ చేశారు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన 14 ఏళ్ల బత్తుల కృప వరుణ్ ఇటుక బట్టీలో పనులు చేస్తూ కనిపించాడు. దీంతో బాలుడిని విచారించగా, తన తల్లిదండ్రులతో కలిసి ఇటుక బట్టీ యజమాని గుంజె వెంకటేశ్వర్లు వద్ద కూలీగా పని చేస్తున్నట్లు తెలిపాడు. నిబంధనలను అతిక్రమించి మైనర్‌తో ప్రమాదకర పనులు చేయిస్తున్నందుకు ఇటుక బట్టి యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## భర్తపై హత్యాయత్నం

- కరెంట్ షాక్ ఇచ్చి హతమార్చేందుకు కుట్ర
- భార్యపై కేసు నమోదు చేసిన పోలీసులు

నర్సింహులపేట, జనవరి 12 : కరెంట్ షాక్‌తో భర్తపై భార్య హత్యాయత్నం చేసిన ఘటన నర్సింహులపేట మండలంలోని గోల్ బొడ్కతండా గ్రామంలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గోల్ బొడ్కతండాకు చెందిన బదావత్ బీకు భార్య తండాలో వివాహేతర సంబంధం పెట్టుకున్నదనే అనుమానంతో గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నింది. బీకు ఇంటి ఎదుట నిద్రిస్తుండగా భార్య విద్యుత్ తీగలతో చేతులు కట్టేసి కరెంట్ షాక్ పెట్టే ప్రయత్నం చేయగా, తేరుకున్న భర్త కేకలు వేయడంతో బాధితుడి తల్లిదండ్రులు వచ్చి కరెంట్ తీగలను లాగేశారు. అప్పటికే షాక్‌కు గురైన బీకును మహబూబాబాద్ దవాఖానకు తరలించారు. బీకు ఫిర్యాదు మేరకు భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేడు ముగ్గుల పోటీలు

కొత్తగూడ, జనవరి 12: మండల కేంద్రంలోని పాత బాయ్స్ హాస్టల్ ఆవరణలో నేడు జవహర్ లాల్ నెహ్రూ యువజన సంఘం (జేఎల్ఎన్‌వైసీ) ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు రణధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనుక జీఎల్‌నగర్, కొత్తగూడ టౌన్, బూర్గు గుంపు, కొమురంభీం కాలనీల్లోని మహిళలు పాల్గొనాలన్నారు. విజేతలకు నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు.

నగదు అందజేస్తున్న నాయకులు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లికుదురు, జనవరి 12: మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన జీపీ సీనియర్ పారిశుధ్య కార్మికుడు ఇస్సంపల్లి ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం జీపీ మండల పారిశుధ్య కార్మికులు బాధిత కుటుబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, జీపీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బొల్లం ఎల్లయ్య, మండల నాయకులు పాషా, వెంకన్న, రామ్‌కోటి, బీ వెంకన్న, సీవెంకన్న, ఈ చంద్రయ్య పాల్గొన్నారు.

# వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కేసముద్రం, జనవరి 12: స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేసముద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. ఇనుగుర్తి: వివేకానంద జీవితం నేటి యువతకు స్ఫూర్తి దాయకమని బీఆర్ఎస్ మండల యూత్ సమన్వయకర్త వడపెల్లి సందీప్ అన్నారు. చిన్ననాగారంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తొర్రూరు: భారతదేశ ఔన్నత్యాన్ని, కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్‌చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ వద్ద వివేకానంద చిత్రపటానికి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బీ రాములు ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. నెల్లికుదురు : యువతకు స్ఫూర్తి ప్రదాత, ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిగకూటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో యువజన దినోత్సవం నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నర్సింహులపేట: వివేకానంద జీవితం అందరికీ ఆదర్శమని నర్సింహులపేట జడ్పీ ఉన్నత పాఠశాల 1995-96 పూర్వ విద్యార్థులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, మల్సూర్, సుంకరి కృష్ణ, గౌని, ఉపేందర్ ఉన్నారు. పెద్దవంగర: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వివేకానంద చిత్రపటానికి ఆదర్శమని యువజన సంఘం ఆధ్వర్యంలో నాయకుడు చిలుక సిద్ధు పూలమాల వేసి నివాళులర్పించారు. దంతాలపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు.

దంతాలపల్లి: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

## జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 12: జపాన్, జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం ఆసక్తి గల వారు తెలంగాణ ఓవర్సీస్ కంపెనీ లిమిటెడ్ వారికి దరఖాస్తు చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం 22-30 ఏళ్ల వారు బీఎస్సీ నర్సింగ్ డిప్లొమా, జర్మనీ నర్సింగ్ అప్రెంటిస్ ప్రోగ్రాం కోసం 18-28 ఏళ్ల లోపు, ఇంటర్మీడియట్ 60 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు శిక్షణ సమయంలో స్టైఫండ్ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 89190 47600 సెల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

తొర్రూరు, డిసెంబర్ 12: ధ్యానంతో వ్యక్తిగత మార్పు వస్తుందని, సకల రోగ నివారణకు ఉపయోగపడి, మానసిక ప్రశాంతత కలుగుతుందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి అన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో యువజన దినోత్సవం, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్రాలంకరణ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జే లక్ష్మీనారాయణ, దాతలు, న్యాయనిర్ణేతలు, సంస్థ నిర్వాహకులు చలువాది అనుపమ-సత్యనారాయణ, వజినపల్లి దీప, మౌనిక, వీ శైలజ, కే మాధవి, ఎన్ రవి, శ్రీనివాస్, యాకయ్య, రమణారెడ్డి, వాణి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

## కేసముద్రం మార్కెట్‌కు 5 రోజుల సెలవు

కేసముద్రం, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 13 నుంచి 17 వరకు 5రోజుల పాటు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని, మార్కెట్ లేని సమయంలో పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురావొద్దని సూచించారు.

## బలవంతంగా భూములను లాక్కోవద్దు

కేసముద్రం, జనవరి 12: ఎన్‌హెచ్-163 నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో బలవంతంగా తమ భూములను లాక్కోవద్దని తౌర్యతండా రైతులు అన్నారు. నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ దామోదర్‌కు వారు వినతిపత్రం అందించారు. హైవే రావడం సంతోషమే అయినా రైతులకు ఏ పద్ధతిలో నష్టపరిహారం ఇస్తున్నారో నేటికీ చెప్పడం లేదన్నారు. భూ నిర్వాసితుల అభిప్రాయాలు తీసుకోకుండా, అవగాహన సదస్సులు నిర్వహించకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు ధరలు ఇవ్వాలని సూచించారు. నెహ్రూ, యాకయ్య, మంజుల, భద్రు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 12: పాఠశాల విద్యార్థులకు పుట్టుకతో వచ్చే రుగ్మతలపై స్క్రీనింగ్, వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా దవాఖానలో ఎర్లీ ఇంటర్వేషన్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు, పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వేషన్ సెంటర్‌కు తరలించాలన్నారు. వైద్యులు విజయకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ఆటో..ఒకరికి గాయాలు

కేసముద్రం, జనవరి 12: బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని భూక్యారాంతండాకు చెందిన భూక్యా రవి కేసముద్రం నుంచి తండాకు వెళ్తుండగా, అంగడి సమీపంలో ఆటో ఢీకొట్టింది. రవి కాలుకు గాయమవగా స్థానికులు చికిత్స కోసం మహబూబాబాద్ దవాఖానకు తరలించారు.

## రైస్ మిల్లుల యజమానులపై కేసు

కేసముద్రం: మండల కేంద్రంలోని రెండు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కేసముద్రంలోని పలు మిల్లుల్లో గురువారం రాత్రి పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేశారు. అయితే శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీ, సాయిరాఘవ రైస్ మిల్లుల్లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం నిల్వలు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ డీఎం కృష్ణవేణి ఫిర్యాదు మేరకు రెండు మిల్లుల యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LEASE/ RENT**
★SVSL ARCADE for Corporate IT-Banks, Retail, Co-Working, Super Markets, Show Rooms etc., 10725 Sq.Fts built-up Buildings, Near: EPF Office, New Darga, NIT Road, Wgl. Cell: 8463900555, 9849197838.
NTW-323112

**CHANGE OF NAME**
I, the undersigned **RESHMA** (New Name), previously called **MD RESHMA** (Old Name), and residing at H.No. 5-5-175, Lashkar Bazar, Hanamkonda, Hanumakonda District-506001, T.S., India. and solemnly declare.

**VEHICLES FOR SALE**
★TS05UC-7972 Anil Shivarathri EICHER PRO 6025 FBT-T 2018, గమనిక: ప్రకటన తేదీ నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును. Auction Date: 13-01-2024, Veune: SHRIRAM AUTOMALL INDIA LTD., Cont: Shriram Finanace Limited, D.No. 24-7-29, 1st Floor, Fathima Complex, Kazipet. 9989809938, 9989313186.
NTW-00

**LOST DOCUMENT**
I, **MUKUND VASANT GADGIL,** S/o. **VASANT GADGIL,** R/o. H.No. 11-23-1774/1, LB Nagar, Warangal, Warangal Urban, My Original Sale Deed Document bearing No. 3001/1983 has been lost while travelling in Auto from Pochammamaidan to MGM, If found please cont.:
**7793951479**

**CHANGE OF NAME**
★I, **MOHAMMED KHAJA NAJMUDDIN, S/o. MOHAMMED KHAJA MOINUDDIN,** R/o. H.No. 7-7-131, Ujilibase, Hanamkonda, DH Suthoon, Warangal, T.S.- 506011, India, have Changed my name to **MOHAMMED KHAJA NAJMUDDIN TABRAIZ** and solemnly declare.
NTW-00

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**CHANGE OF NAME**
★I, **TANVEERSULTHANA, R/o. 1-7-711,** Shanti Nagar, 4th Street, Warangal-Hanumakonda-506 001, T.S. Changed My Name as TANVEER SULTANA, W/o. Mohammad Abdul Khadeer.
NT-319332

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618 9182777213
WARANAGAL 9182777556 9182777557 9182777558
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565